# వాళ్ళు ముగ్గురు.....



రుక్మిణి

ప్రియమైన మురళీ

నీ వుత్తరం మొన్ననే చేరింది. నీ క్షేమములు తెలిసినవి. నే నిచ్చట క్షేమముగా వున్నాను. నీ వన్నట్లు గతించినరోజులు మరి ఏనాటికీ తిరిగి రావు. సారధి మద్రాసులో వుంటున్నాడు. ఉత్తరం మొన్ననే, నీ వుత్తరము చేరిన రోజునే వచ్చింది. మన ముగ్గురం కలిసి కాలేజీ జీవితంలో చేసిన పనులనీ, సారధినీ మాటిమాటికీ గుర్తుతెచ్చుకుంటున్నాను. చాలా ఆనందంగా గడిచిపోయిన రోజులు.

మురళీ నన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నానని వ్రాశావు. నేను లేనిదే బ్రతకలేననికూడా వ్రాశావు. పెండ్లికూడా చేసుకుంటాను, అభిప్రాయం తెలుపమని వ్రాశావు. కాని ఇన్నిరోజులుగా నీకు దాచిపెట్టిన ఒక విషయం నీ ముందు పెట్టాలి. దానిని విశాలహృదయంతో ఆలోచించి, ఆదరిస్తావని తలుస్తాను. ఒకనాడు సారధి నా సర్వస్వాన్నీ దోచుకున్నాడు. నేను ఏమీ చేయలేకపోయాను. పుట్టిన బిడ్డను అనాధ శరణాలయంలో ఇద్దరం కలిసి చేర్పించాము. నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించిన నిన్ను నేను మభ్యపెట్టలేను. ఈ విషయం దాచిపెట్టటం, తర్వాత నీకు తెలిస్తే పరిస్థితులు ఎంత విషపూరితంగా ఉంటాయో ఆలోచించి






నీ కీ విషయం వ్రాశాను. ఆలోచించి జవాబు వ్రాయగలవు - సెలవ్.

—జయ.

* * *

జయా,

నీ వుత్తరం చేరింది. విషయాలన్నీ ఆమూలాగ్రంగా తెలిసినవి. చదువుకునే రోజుల్నుండీ నిన్ను నా అర్ధాంగిగా పవిత్రస్థానంలో ఉంచి ఊహించుకున్న కలలన్నీ చెరిపివేశావు. నిజం చెప్పాలంటే నీ మీదా, సారధి మీదా నాకు ఇలాంటి అనుమానాలు అపుడపుడు కలుగుతూనేఉండేవి. ప్రేమలో విషానికీ, కల్మషానికీ చోటు లేదు. నీ కిది ఒక సామాన్య విషయంగా, మామూలుగా అనిపించడం చూస్తుంటే నా ఒళ్ళు కంపరం పుడుతోంది. అలా ఎలా తెగించి వ్రాయగలిగావు. జరిగిందేదో జరిగిపోయింది. నా కోరికను వెనక్కు తీసుకుంటున్నాను. నీ అందం వెనుక ఇంతటి వికారం, నీ అందమైన చూపులవెనుక ఇంతవిషం దాగివున్నదనుకోలేదు. సారధిని వారించలేకపోయావుకదూ! అవును; వాడు ఇపుడు కాదనిఉంటాడు. నేను నీకు చిక్కేవాడ్ని కాను...గుడ్ బై...

దయచేసి ఉత్తరాలు వ్రాయ ప్రయత్నించకు. మా నాన్న నాకు సంబంధాలుకూడా చూస్తున్నాడు.

—మురళి

* * *

ప్రియమైన జయా,

నీ వుత్తరం చేరింది. త్వరగా జవాబు వ్రాసినందుకు సంతోషం. నీవు చదువుకున్న దానివనీ, చాలా తెలివైనదానివనీ, సంస్కారం గల బుద్ధి నీకున్నదనీ మొదలు అనుకునే వాడ్ని. కాని నీ ఉత్తరం చూశాక నాది పొరపా టనిపించింది. నన్ను బాగా అర్థం చేసుకున్నావనీ, ఎంతయినా చిన్నప్పటినుండీ తిరిగిన స్నేహితులం-మన మనసులు మనకు తెలుసనీ అనుకున్నాం. కాని నా అంచనా తప్పని తేలింది.

మురళి నీకు చేసిన అన్యాయం గురించి వ్రాశావు. ప్రతివాని జీవితంలో కొన్ని అలాంటి ఘట్టాలు రావడం జరుగుతుంది. మీకు కలిగిన 'బాబు'ను అనాథశరణాలయంలో ఎందుకు చేర్పించావు. మన పెండ్లయిన తర్వాత మనమే పెంచుకోవచ్చుగా! నీ కేమిటి అభ్యంతరం.

జయా! నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించినట్లు వ్రాశాను. నిన్ను ప్రేమించినపుడు నీలోని మంచినీ... చెడునీ కూడా ప్రేమించాలి గదా! నీలోని 'మంచి'నే కోరుకుంటే 'చెడు' ఎటుపోవాలి... అలాంటి పిచ్చిభ్రమలు పెట్టుకోకు ... నీ ఉత్తరం చేరగానే ముహూర్తానికి ఏర్పాట్లు చేయించగలను. త్వరగా జాబు వ్రాయగలవు.

—సారధి.

* * *

మురళీ ..

నీవు క్షేమమని తలుస్తాను. నీ కో ముఖ్యవిషయం వ్రాయవలసివచ్చింది. కొద్దిరోజులు తేడాతో నీదగ్గరనుండి-సారధి దగ్గరనుండి ఉత్తరాలు వచ్చాయి. ఇద్దరూ నాకు కావలసిన వాళ్ళే... ఇద్దరూ వివాహం చేసుకోమని అడిగారు. నీకు సారధి గురించి వ్రాసినటువంటి ఉత్తరాన్ని, నీ గురించి సారధికికూడా ఒకటి వ్రాశాను. ఇద్దరి జవాబులూ చదివాను. మన స్నేహాల్లో మనసుల్లో గల భేదాల్ని గుర్తించేటందుకుగాను ఈ ఉత్తరా లన్నీ నీకు పంపిస్తున్నాను. ఒకసారి తీరికగా చదువగలవు.

'శుభలేఖ' పంపిస్తాను. పెండ్లికి తప్పకుండా వస్తావుగదూ!

— జయ.

———



# బహుమతి

యం. ప్రభాకరరావు

"ఏద్మా! ఇది చూశావా!" అంటూ చేతిలో పత్రికతో గదిలోని కడుగు పెట్టింది అరుణ.

ఉలిక్కిపడ్డాను. చూస్తున్న పత్రికలో నుండి దృష్టి మరల్చలేక "ఏమిటే" అన్నాను.

"ఆవురావురుమంటూ అంత శుభవార్త మోసుకొస్తే 'ఏమిటే' అంటూ రాగాలు తీస్తావేమిటి...అబ్బ! అంత దీక్షగా దేవిగారు చదువుతున్నదేమిటో?" నా రెండుభుజాలపైనా చేతులు వేస్తూ అంది అరుణ.

చేతిలోని పత్రికను మూసివేస్తూ "ఆఁ! ఇప్పుడు చెప్పు, అంత శుభవార్తయేమిటో!" అన్నాను దాని రెండు చేతులూ పట్టి సోఫాలో కూర్చొబెడుతూ.

దాన్ని చూడగానే మతిపోయింది. గుడ్లప్పగించి చూస్తూవుంది, మాటా మంతీ లేకుండా. "ఏమిటే, శుభవార్త అంటూ వురుకులు పరుగులతో వచ్చిన దానివి ఇలా మూగదాని వయ్యావేమటి?" అంటూ గబగబా కూజాలోని మంచినీళ్ళు గ్లాసులోకి వంచి దాని